తెలంగాణ గడ్డపై బిజెపి నాటకాలు సాగనీయం

- పొత్తులు, సీట్లు కాదు ప్రజా సమస్యల పరిష్కారమే మాకు ముఖ్యం
- వ్యవసాయ కార్మిక సంఘం బహిరంగ సభలో తమ్మినేని వీరభద్రం
- కష్ట జీవులకు కమ్యూనిస్టులే అండ : బి వెంకట్

బహిరంగ సభలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ గడ్డపై బిజెపి నాటకాలు సాగనివ్వబోమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంపి తమ్మినేని వీరభద్రం అన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మూడవ మహాసభ ప్రారంభం సదర్భంగా గురువారం ఖమ్మంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కమ్యూనిస్టులు ఎక్కడ అని వాగుతున్న వారికి లక్షలాది వచ్చి నోర్లు మూయించిన ప్రతిఒక్కరికీ ఎర్రెర్రని దండాలు అని చెప్పారు. రైతులకు గిట్టుబాటు ధర, వ్యవసాయ కూలీలకు రక్షణ కోసం సమగ్ర చట్టాలు చేయాలని ఎంపిగా ఉన్న సమయంలో పార్లమెంట్‌లో ప్రస్తావించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పటికీ మన పాలకులు ఆ చట్టాలను తీసుకురాలేదని విమర్శించారు. పైగా, వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకుగానూ మూడు రైతు వ్యతిరేక చట్టాలను తెచ్చారని తెలిపారు. తమనెవ్వరూ ఏమి చేయలేరని విర్రవీగుతున్న సమయంలో ప్రధాని మోడీ, అమిత్‌షా మెడలు వచ్చి ఆ చట్టాలను వెనక్కి తీసుకునేలా చేసిన ఘనత ఢిల్లీ రైతాంగ పోరాటానికి ఉందన్నారు. ఆ పోరాటంలో రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల కృషిని ప్రస్తావించారు. ఖమ్మం జిల్లాకు సాగు నీళ్ల కోసం పాదయాత్ర చేసిన ఘనత సిపిఎం దేనన్నారు. పొత్తులు, సీట్ల కోసం తామెప్పుడూ ప్రయత్నించలేదనీ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడటమే తమకు ముఖ్యమని చెప్పారు. మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగానూ సిఎం కెసిఆర్‌కు 20 అంశాలపై నివేదిక ఇవ్వగా అందులో కొన్నింటిని పరిష్కరించేందుకు ఆయన ముందుకొచ్చారని చెప్పారు. ఎమ్ఎస్ స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేరళలో ప్రతి క్వింటా ధాన్యంపై ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం మద్దతు ధర కంటే రూ.800 అదనంగా ఇస్తోందని, దీని ఫలితంగా ఎకరాకు రైతుకు అదనంగా రూ.24 వేలు దక్కుతున్నదని చెప్పారు. రైతులకు గిట్టుబాటు ధర అందుబాటులోకి వస్తే ఇలాంటి ప్రయోజనాలే వస్తాయనీ, ఇక్కడా దీని కోసమే తాము పోరాడుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో మత సమైక్యతను దెబ్బతీసేలా బిజెపి యత్నిస్తున్నదన్నారు. అన్ని మతాల వారూ వరుసలు పెట్టుకుని పిలుచుకునే సంప్రదాయమున్న తెలంగాణ గడ్డపై బిజెపి పప్పులను ఉండకనీయబోమన్నారు. మత ఘర్షణలు సృష్టించో, ఎమ్మెల్యేను కొనో పలు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన బిజెపి తీరును ఎండగట్టారు. మునుగోడులో బిజెపిని ఓడించేందుకు టిఆర్ఎస్‌కు మద్దతిచ్చినప్పటికీ ప్రజా సమస్యలపై సిపిఎం పోరాటాలు ఎప్పటిలాగే చేస్తుందని స్పష్టం చేశారు.

మిగులు భూమి చూపుతాం..పంచేందుకు కెసిఆర్ సిద్ధమేనా : బి వెంకట్

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ..కష్టజీవులకు అండగా ఉండేది కమ్యూనిస్టులేనన్నారు. వ్యవసాయాన్ని అంబానీ, ఆదానీలకు అప్పగించే కుట్రలో మోడీ సర్కారు ఉందని విమర్శించారు. రాష్ట్రంలోని మిగులు భూమిని తాము చూపెడతామనీ, దాన్ని పంచేందుకు కెసిఆర్ ప్రభుత్వం సిద్ధమా అని ప్రశ్నించారు. మహాసభలో కార్యాచరణ రూపొందించుకుంటామనీ, రానున్న రోజుల్లో రాష్ట్రంలో భూపోరాటాలు చేస్తామన్నారు. పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం కొట్లాడుతామని చెప్పారు. దేశానికి కేరళ మోడల్ అవసరమని నొక్కిచెప్పారు. మతానికి, రిజర్వేషన్లకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న బిజెపి, ఆర్ఎస్ఎస్ విధానాలను ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సభలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మూడో మహాసభల ఆహ్వాన సంఘం చైర్మెన్ రవీంద్రనాథ్, ఎఐఎడబ్ల్యుయు అఖిల భారత అధ్యక్షులు విజయరాఘవన్, కేరళ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి చంద్రం, చేతివృత్తిదారుల సంఘం నాయకులు చెరుపల్లి సీతరాములు, సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్, పట్నం కార్యదర్శి డిజి, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్‌వెస్లీ, స్కైలాబ్‌బాబు, మాజీ ఎమ్మెల్యే, రైతు సంఘం నాయకులు జూలకంటి రంగారెడ్డి, తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి సాగర్, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు స్వరాజ్యం, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఆఫీస్‌బేరర్లు, ప్రజాసంఘాల జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

రాష్ట్రానికి రావాల్సిన నిధులివ్వడం లేదు

- తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం : మంత్రి హరీశ్‌రావు
- కాగజ్‌నగర్‌లో 30, బెల్లంపల్లిలో వంద పడకల ఆస్పత్రులు ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో అమలు అవుతున్న పథకాలు దేశానికే ఆదర్శమని, కానీ కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇవ్వడం లేదని వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో 30 పడకల ఆస్పత్రి, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో వంద పడకల ఆస్పత్రి, డయాలసిస్ సెంటర్‌ను గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. మిషన్ భగీరథ, రైతుబంధు పథకాలకే కేంద్రం పేర్లు మార్చి అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలోని తాగేందుకు శుద్ధ జలం అందించాలనే ఉద్దేశంతో మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ అందించామని తెలిపారు. ఆరోగ్యం, అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పల్లెప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారా పారిశుధ్య నిర్వహణపై ప్రజాప్రతినిధులను కలుపుకొని ప్రజల భాగస్వామ్యంతో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, పెద్దపల్లి ఎంపి బోర్లకుంట వెంకటేష్ నేత, ఎమ్మెల్సీ దండె విఠల్, ఆసిఫాబాద్, మంచిర్యాల జెడ్పీ చైర్‌పర్సన్స్ కోవ లక్ష్మి, నల్లాల భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కు, దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, మంచిర్యాల, ఆసిఫాబాద్ కలెక్టర్లు భారతిహోళికేరి, రాహుల్‌రాజ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఎథర్ ఎనర్జీ విస్తరణ

ప్రజాశక్తి-హైదరాబాద్

విద్యుత్ స్కూటర్ల తయారీదారు ఎథర్ ఎనర్జీ తెలంగాణలో తన మూడవ ఎక్స్‌పీరియన్స్ కేంద్రాన్ని కరీంనగర్‌లో ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. ఇది దేశంలో తమకు 77వ అవుట్‌లెట్ అని పేర్కొంది. కొత్తపల్లిలో ప్రారంభించిన నూతన సెంటర్‌లో తమ ప్రతిష్టాత్మకమైన 450 ఎక్స్, 450 ప్లస్‌లను టెస్ట్ రైడ్, కొనుగోలు కోసం ఎథర్ స్పేస్ వద్ద లభ్యమవుతాయని తెలిపింది. ఈ సంస్థ దేశవ్యాప్తంగా 750కు పైగా ఫాస్ట్ చార్జింగ్ పాయింట్లను కలిగి ఉంది.

రామానుజ సమతామూర్తి స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లోని శ్రీ రామానుజ సమతామూర్తి స్ఫూర్తి కేంద్రాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం సందర్శించారు. సమతా మూర్తి స్ఫూర్తి వద్ద రామానుజ చిన్న జీయర్‌స్వామి రాష్ట్రపతికి సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. అంతకుముందు ప్రత్యేక హెలికాప్టర్‌లో సాయంత్రం ఐదు గంటలకు ముచ్చింతల చేరుకున్న రాష్ట్రపతి.. ప్రత్యేక వాహనంలో సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రానికి చేరుకున్నారు.

అనంతరం చిన్న జీయర్ స్వామి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును వెంట తీసుకుని 108 దివ్యసాలు సందర్శిస్తూ ఆలయ విశేషాలు తెలియచేశారు. 216 రామానుజ స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ చూసి అక్కడ నుంచి రామానుజన్ స్వర్ణ విగ్రహాన్ని దర్శనం చేసుకున్నారు. త్రిదండి చిన్న జీయర్ రామానుజ స్వామి ఆమెకు మంగళ శాసనాలు ఇచ్చారు. శ్రీ రామానుజ స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ ఎదురుగా ఏర్పాటు చేసిన డైనమిక్ ఫౌంటైన్ స్పెషల్ షో (త్రీడీ లేజర్ షో)ను తిలకించారు. చిన్న జీయర్ స్వామికి రాష్ట్రపతి ధన్యవాదాలు తెలియజేశారు. ఆమె వెంట

గవర్నర్ తమిళి సై, మంత్రి సత్యవతి రాథోడ్, చిన్న జీయర్ ట్రస్ట్ సభ్యులు కెవి చౌదరి, చలిమెడ లక్ష్మి నరసింహారావు, సైబరాబాద్ సిపి స్టీఫెన్ రవీంద్ర ఉన్నారు.

అధికార పార్టీకి అసంతృప్తి సెగ...

- నిధులు తిరిగి చెల్లించకపోతే మూకుమ్మడిగా రాజీనామా : సర్పంచ్‌లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వం నుంచి గ్రామపంచాయతీ అబివృద్ధి కోసం వస్తున్న నిధులను పంచాయతీ ఖాతాల నుంచి తిరిగి ప్రభుత్వం జమ చేసుకోవడంపై వరంగల్ జిల్లా గూడూరు మండల సర్పంచులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ కరణ్ సింగ్‌కు వినతిపత్రం ఇచ్చి, అనంతరం కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోనుగోడు గ్రామ సర్పంచ్ నల్లమాస వెంకన్న మాట్లాడుతూ.. తక్షణమే నిధులు గ్రామపంచాయతీలో జమ చేయాలని, లేకపోతే మండలంలోని సర్పంచులంతా మూకుమ్మడి జనవరి 3,4 తేదీల్లో రాజీనామా చేస్తామని చెప్పారు. గ్రామాల్లో అభివృద్ధి సంక్షేమం ముందుకు వెళ్లాలంటే తప్పనిసరిగా ప్రభుత్వం వెంటనే నిధులివ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులనూ తక్షణమే అందించాలని కోరారు. అధికార పార్టీ సర్పంచులతో పాటు వివిధ పార్టీల సర్పంచులు నిరసనలో

సూపరింటెండెంట్ కరణ్ సింగ్‌కు రాజీనామాలను అందజేస్తున్న సర్పంచ్‌లు

పాల్గొన్నారు. నిరసనలో అయోధ్య పురం గ్రామ సర్పంచ్ గూగులోత్ తులసీరామ్ నాయక్, తీగలవేణి గ్రామ సర్పంచ్ శైలజ మోహన్ రెడ్డి, సీతానగరం సర్పంచ్ పూజ రమేష్, వెంగంపేట సర్పంచ్ కట్ల భవాని విష్ణువర్ధన్, భూపతిపేట సర్పంచ్ ఆవుల కవిత అశోక్, బ్రాహ్మణపల్లి గ్రామ సర్పంచ్ పునేం యాకయ్య, రాములు తండా సర్పంచ్ గుగులోతు సుగుణ లక్ష్మణ్ పాల్గొన్నారు.

సినీ కార్మికులకు అండగా ఉంటాం

- మంత్రి తలసాని, చిరంజీవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సినీరంగ పరిశ్రమతో పాటు కార్మికులకు అండగా ఉంటామని రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మెగాస్టార్ చిరంజీవి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం మణికొండ మున్సిపాలిటీలోని చిత్రపురి కాలనీలో కార్మికులకు ఇళ్లు పంపిణీ చేశారు. చిత్రపురి కాలనీ 1,176 ఎంఐజి 180 హెచ్‌ఐజి డ్యూప్లెక్స్ ప్లాట్స్ ఓనర్స్‌కు చిరంజీవి ఇంటి తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సినీరంగ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన కమిటీకి అభినందనలు తెలియజేశారు. పనిచేస్తున్న సమయంలో తప్పొప్పులు జరుగుతాయని, వాటిని ఎదిరించి ధైర్యంగా ముందుకెళ్లాలని సూచించారు. చిత్రపురికి మిషన్ భగీరథ పైపులైన్ వచ్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ.. ప్రభుత్వ అండతో సొసైటీ తరపున ఇళ్ల నిర్మాణాలు చేసుకున్నట్టు తెలిపారు. సినీ పరిశ్రమకు ఎక్కడా ఇంత పెద్దగా గృహ సముదాయం లేదన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వ పరంగా సహకరించాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో నిర్మాతలు కళ్యాణ్, తమ్మారెడ్డి భరద్వాజ్, చిత్రపురి కాలనీ అధ్యక్షులు అనిల్‌కుమార్, ఎఫ్‌డిసి చైర్మెన్ అనిల్ కుర్మాచలం, ఫిలిం ఛాంబర్ అధ్యక్షులు బసిరెడ్డి, మున్సిపల్ చైర్మెన్ నరేందర్, వైస్ చైర్మెన్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్ వసంతరావ్ చౌహాన్, చిత్రపురికాలనీ వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ కుమార్, కాలనీవాసులు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అరుణజ్యోతి

బిజెపి హయాంలో పెరిగిన దాడులు

- ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దాడులు పెరిగాయని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి అన్నారు. ఐద్వా అఖిల భారత 13వ మహాసభ నేపథ్యంలో మేడ్చల్ జిల్లా ఇసిఐఎల్ కమలానగర్‌ని కార్యాలయంలో గురువారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు శారద జెండా ఆవిష్కరించారు. అనంతరం అరుణజ్యోతి మాట్లాడుతూ.. దేశంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు, హత్యలు, లైంగికదాడులు పెరిగాయన్నారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు సమావేశాల్లో పాస్ చేయాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో, సంఘ సంస్కరణ ఉద్యమాల్లో, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఎంతోమంది మహిళలు ప్రముఖ పాత్ర పోషించారని గుర్తు చేశారు. నాడు పోరాడి సాధించుకున్న హక్కులను హరించే విధంగా పాలకులు విధానాలను రూపొందిస్తున్నారన్నారు. మహిళల కట్టు, బొట్టు, వస్త్రధారణ, తినే ఆహారం సహా అన్ని అంశాల్లో ఆంక్షలను విధిస్తూ సమాజ తిరోగమన విధానాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా మహిళలు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎం వినోద మాట్లాడుతూ.. సంఘాన్ని మరింత బలపరిచుకునేందుకు గ్రామ గ్రామాన సభ్యత్వం చేర్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కోశాధికారి సఫియా సుల్తానా, ఉపాధ్యక్షులు బి మంగ, ఎన్ పద్మ, ఎ విజయ, సుగుణ, మనెమ్మ, నాగమణి, నజీమా నూర్జహాన్ పాల్గొన్నారు.

సింగరేణి జోలికి వస్తే ఊరుకోం..

- నాలుగు బొగ్గు బ్లాకుల వేలాన్ని నిలిపివేయాలి
- కేంద్రంపై మరో పోరాటానికి సిద్ధం
- జయశంకర్-భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- జిల్లా కేంద్రంలో సింగరేణి పోరు దీక్ష
- సంఘీభావం తెలిపిన సిపిఎం


పోరుదీక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'తెలంగాణ గుండెకాయ సింగరేణిని ప్రయివేటీకరణ చేయనని చెప్పిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాలుగు బొగ్గు బ్లాకులు వేలం వేయడానికి రంగం సిద్ధం చేశారని, దానికి వ్యతిరేకంగా చేస్తున్న సింగరేణి పోరుదీక్షతో కేంద్ర ప్రభుత్వం దిగి రావాలని, లేదంటే తెలంగాణ ఉద్యమం తరహాలో సింగరేణి ఉద్యమం జరుగుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హెచ్చరించారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం 'బిజెపి హటావో.. సింగరేణి బచావో' నినాదంతో సింగరేణి పోరుదీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టిబిజికెఎస్) అధ్యక్షులు బి వెంకట్రావు పూలమాల వేసి దీక్షను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ప్రతిపక్షాలు బలంగా లేవని, వారి బలహీనతను అడ్డుపెట్టుకుని నరేంద్రమోడీ ప్రధానిగా కొనసాగుతున్నాడన్నారు. ప్రధాని రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుశక్తులకు దారదత్తం చేసేందుకు కుట్రపన్నుతున్నాడని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం గద్దెనెక్కిన తొమ్మిదేండ్లలో ఆదానీ ప్రపంచంలోనే నెంబర్‌వన్‌గా ఎదిగాడంటే మోడీ అండదండలతోనే అని ఆరోపించారు. భూపాలపల్లి పట్టణం దినదినాభివృద్ధి చెందుతుందంటే ఇక్కడ సింగరేణి ఉండటం వల్లేనని తెలిపారు. అలాంటి సింగరేణి సంస్థను నిర్వీర్యం చేయాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని దీక్ష చేపట్టినట్టు చెప్పారు. భారతదేశ అభివృద్ధిలో ముఖ్యపాత్ర పోషించే సింగరేణి బొగ్గుబ్లాకులను వేలం వేస్తున్న ప్రధాని మోడీని గద్దె దించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం టిబిజికెఎస్ అధ్యక్షులు వెంకట్రావు, కార్యదర్శి రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లయ్య మాట్లాడారు. 133 ఏళ్ల చరిత్ర కలిగిన సింగరేణిని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు. బొగ్గు నిల్వలు ఎక్కడున్నా తవ్వే అవకాశం సింగరేణికి ఉందని తెలిపారు. బొగ్గుబ్లాకుల వేలాన్ని నిలిపివేయాలని ఎన్నిసార్లు కోరినా చలించలేదని, ప్రాణాలు అడ్డుపెట్టైనా బొగ్గు బ్లాకులను కాపాడుకుంటామని స్పష్టంచేశారు.

బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిందే... : సిపిఎం

కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిందేనని సిపిఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు అన్నారు. సింగరేణికి కేటాయించాల్సిన బొగ్గు బ్లాకులను కేంద్ర ప్రభుత్వం వేలం వేయడాన్ని నిరసిస్తూ భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన పోరు దీక్షకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. రామగుండం పర్యటనకు వచ్చిన ప్రధాని మోడీ బొగ్గు గనులను ప్రయివేటీకరించబోమని చెప్పి వెళ్లి తీరా గనుల ప్రయివేటీకరణకు తలుపులు తెరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే సింగరేణి సంస్థకు చెందాల్సిన నాలుగు బొగ్గు బ్లాకులను రాత్రికి రాత్రే కేంద్ర మంత్రి ప్రయివేటు కంపెనీలకు ధారాదత్తం చేయడానికి వేలం వేయడాన్ని ఖండించాలన్నారు. భవిష్యత్‌లో సింగరేణి సంస్థను పూర్తిగా నిర్వీర్యం చేసే ప్రమాదం ఉందని, ఇప్పటి నుంచే కేంద్రం వైఖరిని ఎండగట్టాలని సూచించారు. రాబోయే కాలంలో బిజెపికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి సిద్దు, వైస్ చైర్మెన్ కొత్త హరిబాబు, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు కటకం జనార్ధన్, జిల్లా నాయకులు, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు, సిపిఎం నాయకులు, భూపాలపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు, ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాలను ప్రారంభిస్తున్న ఎసిపి

గురు నానక్ మెడికల్ కాలేజీ ఉచిత వైద్యశాల

ప్రజాశక్తి - హైదరాబాద్

రంగా రెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నంలోని గురు నానక్ హోమియోపతిక్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ ఉచిత వైద్యశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఇక్కడ స్థానిక ప్రజలకు, ఇతర గ్రామాలకు అందుబాటులో ఉండే విధంగా నూతనంగా ఉచిత వైద్యశాలను ప్రారంభించినట్లు పేర్కొంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా స్థానిక అసిస్టెంట్ కమిషనర్ అఫ్ పోలీస్ టిఎస్ ఉమామహేశ్వర్‌రావు, అతిథులుగా డాక్టర్లు జి అనురాధ, శ్రీనివాస్, దినేష్ తదితరులు హాజరయ్యారు. ఎసిపి ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ.. గురు నానక్ యాజమాన్యం ప్రారంభించిన ఈ హోమియోపతిక్ వైద్యశాల ద్వారా స్థానిక ప్రజలు వైద్య సదుపాయాలు ఉచితంగా పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని స్థానిక ప్రజలే కాకుండా ఇతర గ్రామాల ప్రజలు కూడా పొందాలని సూచించారు.

ఒయులో గ్లోబల్ అలుమ్ని మీట్

- 3, 4వ తేదీల్లో నిర్వహణ
- ఒయు మొత్తం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఇదే తొలిసారి
- విసి ప్రొఫెసర్ రవీందర్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనవరి 3, 4వ తేదీల్లో ఒయు క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో గ్లోబల్ అలుమ్ని మీట్-2023 నిర్వహించనున్నట్టు విసి ప్రొఫెసర్ డి రవీందర్ తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యాబుద్ధులు నేర్చుకుని ప్రపంచవ్యాప్తంగా స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా ఈ సమ్మేళనంలో పాల్గొనాలని కోరారు. గురువారం ఒయు గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. విభాగాల వారీగా ఒయు మొత్తం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఇదే తొలిసారని చెప్పారు. ఒయు సమగ్ర అభివృద్ధి, బాండింగ్ విషయంలో పూర్వ విద్యార్థులను భాగస్వామ్యం చేసే దిశగా సెక్షన్-8 కంపెనీ కింద ఇప్పటికే ఉస్మానియా ఫౌండేషన్ ఏర్పాటు చేశామని వివరించారు.

సిఎస్ఆర్, అలుమ్ని, బాండింగ్ కోసం సిఎబి డైరెక్టరేట్‌ను రూపకల్పన చేశామన్నారు. కనెక్ట్ టు రీ కనెక్ట్ పేరుతో పూర్వ విద్యార్థులందరినీ ఉస్మానియన్లుగా ఒకే వేదిక ద్వారా కలిపే ప్రయత్నంలో భాగంగా సమ్మేళనంలో పాల్గొనేందుకు ఇప్పటికే వెయ్యి మంది పూర్వ విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. ఉస్మానియా ఫౌండేషన్ ద్వారా విశిష్ట పూర్వ విద్యార్థులు, విశ్రాంత విసిలు, విద్యావేత్తలు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ, ప్రయివేటు రంగంలో కీలక భూమిక పోషిస్తున్న ఒయు పూర్వ విద్యార్థులను భాగస్వామ్యం చేసేందుకు 16 కమిటీలు పనిచేస్తున్నాయన్నారు. గ్లోబల్ అలుమ్ని మీట్ (జిఎఎం) జనవరి 3వ తేదీన ప్రారంభమవుతుందని, ఒయు అభివృద్ధి, ఇతర అంశాలపై విశిష్ట పూర్వ విద్యార్థులతో పలు బృంద చర్చలు (ప్యానల్ డిస్కషన్స్), యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లోని లాన్‌లలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. 4వ తేదీన పూర్వ విద్యార్థులు ఆయా విభాగాలను సందర్శించి, అధ్యాపకులు, విద్యార్థులతో మమేకమై చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకునేలా సంబంధిత హాస్టళ్లలోనే భోజనం ఏర్పాట్లు చేశామన్నారు. సమావేశంలో ఒయు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి లక్ష్మి నారాయణ, ప్రొ స్టీవెన్‌సన్, డైరెక్టర్ ప్రొ రాజశేఖర్, ప్రొ ప్యాట్రిక్ పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న విసి ప్రొఫెసర్ రవీందర్

In the court of the Senior civil Judge, Kavali
O.S.no.3/2021

Between:
Thotreddy Maithili,
Rep. her GPA. Agent
Thotreddy Janardhan Reddy - Plaintiff
Vs
Thotreddy Sridevi
and others - Defendants

Notice

To,
D3) **Thotreddy Mounika,**
W/o **GopikrishnaReddy,**
House wife: Res: EWS1185,
KYES Colony,Thirumalagiri,
Kukatpalli, Hyderabad. అనువారికి,

ఈ నంబరున వాది మీపై దావా దాఖలు చేసి యున్నందుకు నీకు నోటీసు నిమిత్తం వాయిదా తే.05-01-2023ది.కి వేయబడియున్నది. ఆదినము పగలు 10.30 గంటలకు పైకోర్టు వారి యెదుట నీవు హాజరై, ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల నీపరోక్షమందు యక్స్ పార్టీగా తీర్మానించబడును.

ఇట్లు,
యన్.యస్.కిరణ్‌కుమార్
వాదితరుపు అడ్వకేట్,
కావలి-524201.

నూతన డిజిపిగా అంజనీకుమార్

- రవి గుప్తాకు ఏసిబి పగ్గాలు
- హోం శాఖ సెక్రెటరీగా జితేందర్
- ప్రభుత్వం ఉత్వర్వులు జారీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర నూతన డిజిపిగా అంజనీకుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్వర్వులు జారీ చేసింది. ఈయనతో పాటు మరికొందరు సీనియర్ ఐపిఎస్ అధికారులను కూడా బదిలీ చేసింది. రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న అంజనీ కుమార్‌ను కీలకమైన రాష్ట్ర డిజిపి పోస్టులో ప్రభుత్వం నియమించింది. ఆయన 1990వ బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపిఎస్ అధికారి. ఇదే బ్యాచ్‌కు చెందని మరో సీనియర్ ఐపిఎస్ అధకారి, రాష్ట్ర హెూం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ రవి గుప్తాకు ఏసీబీ పగ్గాలను అప్పగిస్తూ ఆ శాఖ డైరెక్టర్ జనరల్‌గా బదిలీ చేశారు. అలాగే, 1992వ బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపిఎస్ అధికారి, రాష్ట్ర శాంతి భద్రతల విభాగం అదనపు డిజి జితేందర్‌కు రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బాధ్యతలను అప్పగించారు. ఇక దాదాపు ఆరేళ్లుగా రాచకొండ పోలీసు కమిషనర్‌గా కొనసాగుతున్న అదనపు డిజి మహేశ్ భగవత్‌ను రాష్ట్ర సిఐడి విభాగం డైరెక్టర్ జనరల్‌గా బదిలీ చేశారు. నగర అదనపు పోలీసు కమిషనర్ దేవేందర్‌సింగ్ చౌహాన్‌కు రాచకొండ పోలీసు కమిషనర్ పగ్గాలను అప్పగించారు. రాష్ట్ర ప్రొవిజన్స్ అండ్ లాజిస్టిక్స్ అదనపు డిజి సంజయ్‌కుమార్ జైన్‌ను రాష్ట్ర శాంతి భద్రతల విభాగం అదనపు డిజితో పాటు అదనంగా రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ బాధ్యతలను అప్పగించారు. ఇదిలా ఉంటే ప్రస్తుత డిజిపి ఎం మహేందర్‌రెడ్డి పదవీ విరమణ చేశాక రాష్ట్ర డిజిపిగా నియమితులైన అంజనీకుమార్ ఈనెల 31న నూతన బాధ్యతలను స్వీకరించనున్నారు. సమర్థుడు, చిత్తశుద్ధిగల ఐపిఎస్ అధికారిగా పేరు పొందిన అంజనీ కుమార్.. గతంలో నిజామాబాద్ రేంజ్ డిఐజిగా, రాష్ట్ర పోలీసు ట్రైనింగ్ విభాగం ఐజీ, రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం ఐజిగా బాధ్యతలు నిర్వర్తించారు. అంతేగాక, రాష్ట్ర శాంతి భద్రతల విభాగం అదనపు డిజిగా, హైదరాబాద్ నగర అదనపు పోలీసు కమిషనర్‌గా, అనంతరం పోలీసు కమిషనర్‌గా కీలకమైనబాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారు. నగర పోలీసు కమిషనర్‌గా ఉన్న సమయంలో పలు నూతన కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. దాదాపు మూడేండ్ల పాటు నగర పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన అంజనీకుమార్.. డిజిపి హోదాకు పదోన్నతి పొందాక రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్‌గా, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజిగా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. తన పని తాను చేసుకుపోతూ, వివాదాలకు దూరంగా ఉండే అంజనీ కుమార్.. ప్రజలతో పోలీసులు ఎప్పుడూ మమేకం కావాలని కోరుతూ ఆ దిశగా చర్యలు చేపడుతుంటారు.

మూడురోజుల చిన్నారికి కిమ్స్ కడిల్స్‌లో ప్రాణదానం

ప్రజాశక్తి- హైదరాబాద్

మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన దంపతులకు అక్కడ పుట్టిన చిన్నారికి కొన్ని గంటల్లోనే శ్వాసకోశ సమస్యలు, గుండెలోపాలు ఉత్పన్నమయ్యాయి. ఆ బాధలోనే తమ మూడు రోజుల శిశువును కొండాపూర్‌లోని కిమ్స్ కడిల్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. కిమ్స్ కడిల్స్‌లో పలువురు నిపుణుల బృందం తక్షణం 12 గంటల మారథాన్ శస్త్రచికిత్స చేసి, బాలుడికి కొత్త జీవితాన్ని ఇచ్చినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. పుట్టగానే శిశువు సాధారణంగానే ఉన్నట్లు ప్రసవానంతర స్కాన్లలో తేలింది. కానీ.. సుమారు 12 గంటల తర్వాత, బాబు ఊపిరి పీల్చుకోడానికి ఇబ్బంది పడుతుండటం, చర్మం క్రమంగా నీలిరంగులోకి మారడం (సైనోసిస్)తో శిశువు తల్లిదండ్రులు శ్వాసకోశ బాధను గమనించి.. వైద్యం కోసం కిమ్స్ కడిల్స్‌కు తీసుకువచ్చారు. ఎన్ఐసియు వైద్య బృందంలో చీఫ్ నియోనాటాలజీ విభాగాధిపతి డాక్టర్ సి అపర్ణ నేతృత్వంలో చిన్నారికి మెరుగైన వైద్య సేవలు అందించి ప్రాణం కాపాడరని కిమ్స్ కడిల్స్ తెలిపింది.

హరినాథరావుకు సిఎం నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తన వియ్యంకుడు, మంత్రి కె.తారకరామారావు మామ పాకాల హరినాథరావు మరణం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని రాయదుర్గం వద్ద నివాసానికి వెళ్ళి హరినాథరావు భౌతికకాయానికి సిఎం నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో మంత్రులు మహమూద్ అలీ, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎంపి జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్యే బాల్క సుమన్, జీవన్ రెడ్డి, ఎమ్మెల్సీలు మధుసూధనాచారి, శేరి సుభాష్ రెడ్డి, మాజీ మంత్రి వేణుగోపాలాచారి, డాక్టర్ ఆంజనేయ గౌడ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేల ఎర కేసులో ముందే ఆధారాలు ఎలా వచ్చాయి?

- సిఎం కెసిఆర్‌కు కాంగ్రెస్ నేత నిరంజన్ ప్రశ్న

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యేల ఎర కేసులో సిఎం కెసిఆర్‌కు ముందుగా ఆధారాలు ఎలా వచ్చాయని కాంగ్రెస్ నేత జి.నిరంజన్ ప్రశ్నించారు. ఈ కేసు విషయంలో హైకోర్టు పలు కీలకమైన అంశాలను వెల్లడించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సిఎంకు ఆధారాలు దొరకడం పెద్ద మిస్టరీగా మారిందన్నారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తనకు ఆధారాలెలా చేరాయో ప్రజలకు సమాధానం చెప్పాలని సిఎంను డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన తప్పిదాల నుంచి తప్పించుకునేందుకే సిట్‌ను ఏర్పాటు చేసిందన్నారు. దీనికి బాధ్యత వహిస్తూ... కెసిఆర్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ అధికారులకు అన్యాయం రేవంత్‌రెడ్డి ట్వీట్

ఐపిఎస్ పోస్టింగుల విషయంలో తెలంగాణ అధికారులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని పిసిసి అధ్యక్షులు, ఎంపి ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ట్వీట్ చేశారు. డిజిపితోసహా ఆరుగురు సీనియర్ ఐపిఎస్‌లకు కీలక పోస్టింగులు ఇచ్చినప్పటికీ... అందులో ఒక్కరు కూడా తెలంగాణ మూలాలు ఉన్న అధికారులు లేకపోవడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. 'కల్వకుంట్ల రాజ్యంలో నిన్న పార్టీలో, నేడు పరిపాలనలో 'తెలంగాణం' మాయమె పోయింది' అని ఆవేదన వ్యక్తం చేశారు.

జనవరి 4న కాంగ్రెస్ శిక్షణా తరగతులు

కాంగ్రెస్ పార్టీ కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలకు జనవరి 4న శిక్షణా తరగతులను నిర్వహించనుంది. పార్టీ అన్ని స్థాయిలో బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకులు ఈ సమావేశంలో హాజరు కానున్నారు. వీటి నిర్వహణ కోసం పలు కమిటీలను ఆ పార్టీ నియమించింది.

రైల్వే హాల్ట్‌లను పునరుద్ధరించండి

- రైల్వే సహాయ మంత్రి దర్శన్‌కు గవర్నర్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిద్ధిపేట జిల్లా కొమరవెల్లి కమాన్ వద్ద రైల్వే హాల్టింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని రైల్వేశాఖ సహాయ మంత్రి దర్శన విక్రమ జర్దోష్‌ను రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ కోరారు. గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసైను ఆమె మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కోవిడ్-19 సమయంలో పెద్దపల్లి జిల్లా కొత్తపల్లి రైల్వేస్టేషన్‌లో పలు రైళ్ల నిలుపుదలను ఆపేశారనీ, అక్కడి ప్రజలకు అది ఇబ్బందిగా మారిందంటూ గవర్నర్ తెలిపారు. ఆయా హాల్ట్‌లను పునరుద్ధరించాలని కోరారు. హైదరాబాద్ నుంచి తంబారం వెళ్లే చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌ను కన్యాకుమారి వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. సాంకేతికపరమైన అంశాలను పరిశీలించిన అనంతరం తదుపరి సానుకూల చర్యలను తీసుకుంటామని కేంద్ర మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.

కర్ణాటకలో చర్చిపై దాడి దుర్మార్గం : ఆవాజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కర్ణాటక రాష్ట్రంలోని పెరియాపట్టణంలోని చర్చిపై మతోన్మాదులు దాడి చేసి, అక్కడి వస్తువులను, విగ్రహాలను ధ్వంసం చేయడాన్ని ఆవాజ్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. క్రిస్మస్ వేడుకల నేపథ్యంలో చర్చిపై మతోన్మాదులు దాడికి పాల్పడడం అత్యంత దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాల్లో క్రిస్టియన్, ముస్లిం మైనార్టీలను, దళిత, గిరిజన, బలహీన వర్గాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని విమర్శించారు. రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తూ, భౌతికదాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. మత చిహ్నాలను ధ్వంసం చేస్తూ, దేశంలో మత విద్వేషాలను రగిలిస్తున్నారని గుర్తు చేశారు. త్వరలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇలాంటి దాడులు ఎవరి రాజకీయ ప్రయోజనాల కోసమనేది ప్రజలు అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లౌకిక, ప్రజాస్వామ్యక విలువలను కాలరాస్తూ బిజెపి నేతలు దేశంలో అశాంతిని పెంచుతున్నారని విమర్శించారు. అధికార యంత్రాంగం, పాలకపక్షం అండదండలు ఉండడం వల్లనే మతోన్మాదులు బరితెగించిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు మతోన్మాదుల దుర్మార్గాలను ఖండించాలనీ, మతం ముసుగులో జరుగుతున్న అరాచకాలను అరికట్టేందుకు పాలకులపై ఒత్తిడి పెంచాలని విజ్ఞప్తి చేశారు.

టాడి కార్పొరేషన్‌ను బలోపేతం చేయండి

- ప్రభుత్వ ముఖ్యకార్యదర్శికి కల్లుగీత కార్మిక సంఘం వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని టాడి కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేయాలని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం కోరింది. గీతవృత్తిలో ప్రమాదం జరిగిన వారికి కార్పొరేషన్ నుంచి తక్షణ సాయం అందిస్తున్న బిసి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని అభినందించింది. గీత కార్మికులు, గౌడ యువతీ, యువకులకు ఉపాధి కలిగే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. అందుకు తగిన విధంగా బడ్జెట్ కేటాయించడంతోపాటు రుణ సౌకర్యం కల్పించాలని కోరింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లో బుర్రా వెంకటేశానికి ఆ సంఘం రాష్ట్ర బృందం వినతిపత్రం సమర్పించింది. డిసెంబర్ 18 నుంచి ఇప్పటి వరకు ప్రమాదానికి గురైన 439 మందికి గీత కార్మికులకు ప్రభుత్వం రూ.75 లక్షలు అందించారని నాయకులు తెలిపారు. ఆయా కుటుంబాలకు కార్పొరేషన్ నుంచి రుణ సౌకర్యం కల్పించి ఆదుకోవాలనీ, చదువుకునే పిల్లలకు గురుకుల రెసిడెన్షియల్లో సీట్లు ఇవ్వాలని కోరారు. చనిపోయిన వారి కుటుంబాలకు దహన ఖర్చుల కింద ఇస్తున్న రూ.25 వేలను రూ.50 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. వైద్య ఖర్చులకు ఇస్తున్న రూ.15 వేలను రూ.25 వేలకు పెంచాలనీ, ప్రమాద నివారణకు 'సేఫ్టీ రోప్' తక్షణమే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో భూమి కొనుగోలు పథకంలో 439 సొసైటీలకు ఇచ్చిన భూమికి ఫెన్సింగ్ చేయించి పొట్టి తాటి, ఈత, ఖర్జూర, జీనుగు చెట్లను ఇవ్వాలనీ, వాటికి నీటి సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. జిఒ 560 ప్రకారం దరఖాస్తు చేసుకున్న సొసైటీలకు ఐదెకరాల చొప్పున భూమి పట్టా చేయించాలన్నారు. వాటిని త్వరలో అమలు చేసే విధంగా చూస్తామని ముఖ్యకార్యదర్శి హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు యం.వి.రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లుతోపాటు రాష్ట్ర నాయకులు ఎల్గూరి గోవిందు, వి.వెంకట నరసయ్య, బూడిద గోపి, ఎస్ రమేష్‌గౌడ్, గౌని వెంకన్న, బాల్నే వెంకటమల్లయ్య, బొలగాని జయరాములు, బండకింది అరుణ్, గాలి అంజయ్య, పామనుగుల్ల అచ్చాలు తదితరులు ఉన్నారు.

నేరాలు 4.44 శాతం పెరిగాయి

- విపరీతమైన సైబర్, వైట్‌కాలర్ నేరాలు
- ఒకే తరహా పోలీసింగ్‌తో ప్రజలకు చేరువయ్యాము
- మావోయిస్టులను రాష్ట్రంలో అడుగు పెట్టనివ్వం
- శాంతి భద్రతలపై వార్షిక నివేదికను సమర్పించిన డిజిపి మహేందర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో శాంతి భద్రతలు సవ్యంగా ఉన్నప్పటికీ.. కొద్ది శాతం మేరకు నేరాలు పెరిగాయని రాష్ట్ర డిజిపి ఎం.మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం తన కార్యాయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ ఏడాదికి సంబంధించి శాంతి భద్రతలు, నేరాలపై వార్షిక నిదేదికను డిజిపి మహేందర్‌రెడ్డి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలు, నేరాల పెరుగుదల, ఇతర రాష్ట్ర పోలీసులు సాధించిన విజయాలను ఆయన విపులంగా వివరించారు. ముఖ్యంగా రాష్ట్రంలోకి మావోయిస్టులను రానివ్వకుండా తీసుకున్న చర్యలు మంచి ఫలితాలను ఇచ్చాయని తెలిపారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి మావోయిస్టులు రాష్ట్రంలోకి వలస రాకుండా సరిహద్దుల్లో సాయుధ బలగాలతో గట్టి నిఘాను ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. ఈ ఏడాది రాష్ట్ర పోలీసులు 120 మంది మావోయిస్టులను అరెస్టు చేయగా, మరో 32 మంది లొంగిపోయారని అన్నారు. మరోవైపు, రాష్ట్రంలో ఎలాంటి మత ఘర్షణలు చోటు చేసుకోకుండా పోలీసులు తీసుకున్న చర్యలు ఫలితాన్ని ఇచ్చాయని తెలిపారు. ఉగ్రవాదుల కార్యకలాపాలు సాగకుండా రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం తీసుకున్న వ్యూహాత్మక చర్యలు కూడా మంచి ఫలితాలను ఇచ్చాయని డిజిపి చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని రాష్ట్రంలో పలు కీలక కేసులను పరిశోధించడంలో విజయవంతం అయ్యామని డిజిపి తెలిపారు.

సైబర్ నేరాలు కొత్త పుంతలు తొక్కడం వల్ల ఆ నేరలు 57 శాతం పెరిగాయని, అలాగే వైట్ కాలర్ నేరాలు 35 శాతం పెరిగాయని అన్నారు. దీంతో రాష్ట్రంలో గతేడాది కంటే ఈ సంవత్సరం 4.44 శాతం నేరాలు పెరిగాయని తెలిపారు. ముఖ్యంగా హత్యలు, హత్యాయత్నాలు, ఆస్తి కోసం హత్యలు వంటి నేరాలు తగ్గుముఖం పట్టాయనీ.. దారి దోపిడీలు, దొంగతనాలు కొంత శాతం పెరిగాయని తెలిపారు. లైంగిక నేరాలు తగ్గినప్పటికీ మహిళల కిడ్నాప్‌లు, ఇతర నేరాలు మహిళలకు సంబంధించి 18 శాతం పెరిగాయని వివరించారు. ఈ ఏడాది శాంతి భద్రతల పరంగా పలు సవాళ్లు ఎదరైనప్పటికీ పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరించి పరిస్థితులను అదుపు చేశారని డిజిపి చెప్పారు.

పోలీసు స్టేషన్‌కు బాధితుడు ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేసి తన సమస్యకు పరిష్కారాన్ని సాధించేలా చేయడమే తమ లక్ష్యంగా ఆయన వివరించారు. నేరగాళ్ల ఏరివేతకు టెక్నాలజీని వాడటం వలన మంచి ఫలితాలను సాధించామనీ, ఇందులో సీసీ టీవీలు, వేలి ముద్రల విభాగాలు ఫోరెన్సిక్ విభాగాలు కీలకంగా వ్యవహరిస్తున్నాయని డీజీపీ వివరించారు. నేరాలను అదుపు చేయడానికి ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా సహాయాన్ని కూడా తీసుకుంటున్నామని అన్నారు. హత్యలు, హత్యాయత్నాలు, దోపిడీలు, చోరీలు, మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలకు సంబంధించిన కేసులు, కొంత మేరకు తగ్గాయని రోడ్డు ప్రమాదాలు కొంత మేరకు పెరిగాయనీ, మాదక పదార్థాల కేసులు కొంత తగ్గాయని డీజీపీ తెలిపారు.

మహిళల భద్రతకు సంబంధించి షీటీమ్ బృందాలు పని చేస్తూ మంచి ఫలితాలను సాధిస్తున్నాయని తెలిపారు. ఈ ఏడాది 431 మంది నేరగాళ్లపై పీడీ చట్టాన్ని ప్రయోగించామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర శాంతి భద్రతల విభాగం అదనపు డిజిపి జితేందర్, నగర కమిషనర్ సివి ఆనంద్, ఐపిఎస్ అధికారులు విజయ్‌కుమార్, సందీప్ శాండిల్య, మహేష్ భగవత్ తదతరులు హాజరయ్యారు.

సిఎస్ రావు ఆదర్శాలు కొన సాగించాలి

ప్రజాశక్తి- కల్చరల్

గొప్ప నాటక కర్త సమ సుమాజ భావాలు కల సిఎస్ రావు ఆదర్శాలు నేటి తరం బాలకు నేర్పి గీతాంజలి విద్యా సంస్థ ఆయన వేసిన బాటను కినసాగించాలని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ కోరారు. శ్రీత్యాగరాయ గాన సభ ప్రధాన వేదిక పై అశోక్ నగర్‌లోని గీతాంజలి హైస్కూల్ 40వ వార్షికోత్సవం పిల్లలు ఆట పాటల మధ్య సందడి సందడిగా జరిగాయి. ముఖ్యతిధిగా డాక్టర్ రమణ పాల్గొని విద్యతో పాటు కళలకు క్రీడలకు అధిక ప్రాధన్యతనిస్తున్న గీతాంజలి విద్యా సంస్థను ఉన్నత ఆశయాలతో సిఎస్ రావు ప్రారంభించారని అన్నారు. ఆయన నాటక కర్తగా సామజిక ఆలోచనలతో రసారని భావి భారత పౌరులుగా, అయన ఆలోచనలకు అనుగుణంగా ఎదగాలని పిల్లలకు సూచించారు. వ్యక్తిత్వ వికాస బోధకురాలు సత్యవాణీ మాట్లాడుతూ తెలుగు భాష సంస్కృతిని కొనసాగించవలసిన బాధ్యత పిల్లలపైనే ఉందన్నారు డిజిటల్ మీడియాపై ఆధార పడకుండా గ్రంధాల పఠనంపై దృష్టి పెట్టాలని పిల్లలను కోరారు. ఆధ్యాత్మిక వక్త ఆచార్య అనంత లక్ష్మి పిల్లలు క్రమశిక్షణ, పట్టు దల దీక్ష తో ఉన్నత ఆశయాలు కలిగి ఉండాలని కోరారు గీతాంజలి విద్యా సంస్థ కార్యదర్శి డాక్టర్ శాంత నివేదిక సమర్పించారు అంతకు ముందు కలర్ ఫుల్ ఇండియా నృత్య నాటిక ప్లాస్టిక్ వద్దు, జింగల్ బెల్ నృత్యాలు ఆకట్టుకున్నాయి.

59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

- మంత్రి గంగుల కమలాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వానాకాలం పంటకు సంబంధించి రాష్ట్రంలో 59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తయినట్టు పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 7,011 ధాన్యం కొనుగోలు కేంద్రాలకుగానూ 4,607 కొనుగోలు కేంద్రాల్లో ప్రక్రియ పూర్తయిందనీ, దీంతో వాటిని మూసివేశామని తెలిపారు. బుధవారం వరకు 10.40 లక్షల మంది రైతుల నుంచి రూ.12,051 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించినట్టు వివరించారు. ఒపిఎంఎస్‌లో నమోదైన రూ.11 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఇప్పటి వరకు అత్యధికంగా నిజమాబాద్ జిల్లాలో ఆరు లక్షల మెట్రిక్ టన్నులు, కామారెడ్డిలో ఐదు లక్షల మెట్రిక్ టన్నులు, నల్లగొండలో నాలుగు లక్షల మెట్రిక్ టన్నులు సేకరించగా అత్యల్పంగా అదిలాబాద్, గద్వాల్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలో సేకరణ కొనసాగుతున్నదని మంత్రి వెల్లడించారు.

గిరిజన సంక్షేమం భేష్...

- రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కితాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీల కోసం చేపడుతున్న ప్రయోజనాలు, ప్రత్యేకంగా బలహీన గిరిజన సమూహాల అభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కితాబిచ్చారు. హైదరాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ప్రత్యేక బలహీన గిరిజన సమూహాల (పివిటిజిఎస్) సభ్యులు, విద్యార్థులతో ఆమె గురువారం స్వయంగా మాట్లాడారు. విద్య, వైద్యం, సాగు, తాగునీరు, కనీస మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం తీసుకుంటున్న కార్యక్రమాల పట్ల ఆమె సంతృప్తిని వ్యక్తం చేశారు. గిరిజనుల కోసం ప్రత్యేకంగా వైద్య, విద్యం, రోడ్లు, విద్యుత్, రైతుబంధు, మిషన్ భగీరథ, కళ్యాణ్ లక్ష్మి తదితర పథకాలను అమలు చేస్తున్నట్టు అధికారులు చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తూ ఎస్‌టిల కోసం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వీడియో ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్రపతికి వివరించారు. 'రాష్ట్రంలో పది గిరిజన తెగలైన లంబాడాలు, కోయలు, గోండులు, ఎరుకల, పర్ధానులు, ఆంధులతోపాటు ఆదిమ జాతి తెగలయిన కొల్లాములు, చెంచులు, తోటి, కొండారెడ్డి తెగలు ఉన్నాయి. రాష్ట్రంలో నాలుగు సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలు ఉన్నాయి. తొమ్మిది జిల్లాల్లో షెడ్యూల్ ప్రాంతాల్లో అవి విస్తరించి ఉన్నాయి. వీటిలో షెడ్యూల్ మండలాలు, 3,146 గిరిజన గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతి ఏడాది రైతు బంధు ద్వారా 8.5 లక్షల మంది గిరిజనులకు ఇప్పటి వరకు రూ.7,349 కోట్ల వ్యవసాయ పెట్టుబడి సహాయాన్ని ప్రభుత్వం అందించింది. 6.08 లక్షల గిరిజన ఆవాసులకు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు అందుతుంది. గిరిజనుల ఆరోగ్య వసతి కోసం 437 సబ్ సెంటర్లు, 32 బర్త్ వెయిటింగ్ రూములు, 7 డయాగ్నొస్టిక్ హబ్‌లను నిర్మించాం. ఆదిమ గిరిజన తెగల ప్రాంతాల్లో 31 పాఠశాలలు, కోలముల కోసం ప్రత్యేకించి ప్రాథమిక పాఠశాలలు, సైనిక్ పాఠశాల, న్యాయవిద్య, ఫైన్ ఆర్ట్స్ కోసం ప్రత్యేక కళాశాల ఏర్పాటుతోపాటు వికలాంగుల కోసం ప్రత్యేక పాఠశాలలను నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 918 గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాలకు పొందారు. అంతే కాకుండా సిఎం ఎంటర్‌ప్రెన్యూర్ పథకం కింద 205 మంది యువతకు ఎనిమిది విభాగాల్లో సహకారం అందించాం.

ఇందులో ఐదుగురు ఆదిమ గిరిజన తెగలకు చెందిన వారు కాగా... ఇద్దరు చెంచులు, ఇద్దరు తోటీలు, ఒక కొల్లాం తెగకు చెందిన వారున్నారు. 1.4 లక్షల గిరిజన యువతులకు కళ్యాణ లక్ష్మి పథకం కింద రూ.1,126 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించాం' అని తెలిపారు.

18 శాఖల్లో 783 పోస్టులు భర్తీ

- గ్రూప్ 2 నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని నిరుద్యోగులకు కొత్త సంవత్సర కానుకగా రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. 18 శాఖల్లో ఖాళీగా ఉన్న 783 పోస్టులకు టిఎస్‌పిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసింది. వచ్చే ఏడాది జనవరి 18 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ మొదలవుతుంది. ఫిబ్రవరి 6వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్టుల వివరాలు

- మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌లో మున్సిపల్ కమిషనర్ గ్రేడ్ 3 పోస్టులు - 11
- కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ - 59
- ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌లో నయిబ్ తహసిల్దార్ పోస్టులు - 98
- రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిపార్ట్‌మెంట్‌లో సబ్-రిజిస్ట్రార్ ఖాళీలు - 14
- అసిస్టెంట్ రిజిస్ట్రార్ అండర్ ది కంట్రోల్ ఆఫ్ కమిషనర్ ఫర్ కో-ఆపరేషన్ పోస్టులు - 63
- కమిషనర్ ఆఫ్ లేబర్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఖాళీలు - 09
- పంచాయత్ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో మండల పంచాయత్ ఆఫీసర్ - 126
- ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్- 97
- హ్యాండ్‌లూమ్స్, టెక్స్‌టైల్ డిపార్ట్‌మెంట్‌లో- అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ - 38
- జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఖాళీలు - 165
- లెజిస్లేటివ్ సెక్రెటేరియట్‌లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ 15
- ఆర్థిక శాఖలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ - 25
- న్యాయ శాఖలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ - 07
- తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ - 02
- జువెనైల్ కరెక్షనల్ సర్వీసెస్ డిస్ట్రిక్ ప్రొబేషన్ ఆఫీసర్ గ్రేడ్ 3 పోస్టులు - 11
- బిసి సంక్షేమ శాఖలో అసిస్టెంట్ బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ - 17
- గిరిజన సంక్షేమ శాఖలో అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ - 09
- షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి శాఖలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ - 17

ప్రమాదకరంగా కరెంట్ ఖాతా లోటు

న్యూఢిల్లీ : భారత కరెంట్ ఖాతా లోటు (సిఎడి) ప్రమాదకరంగా నమోదవుతుంది. దేశ ఎగుమతులు పడిపోవడం, దిగుమతులు పెరగడంతో వాణిజ్య లోటు ఎగిసిపడుతోంది. దీంతో జిడిపిలో సిఎడి భారీగా పెరిగి ప్రమాద ఘంటికలను మోగిస్తుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగి సిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో జిడిపిలో కరెంట్ ఖాతా లోటు 4.4 శాతానికి చేరిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గురువారం ఓ రిపోర్టులో వెల్లడించింది.

ఇంతక్రితం ఏప్రిల్ - జూన్ కాలంలో ఇది 2.2 శాతంగా ఉంది. దీంతో పోల్చితే గడిచిన సెప్టెంబర్ త్రైమాసికంలో సిఎడి రెట్టింపు అయ్యింది. "2022-23 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాని కంలో కరెంట్ ఎకౌంట్ లోటు 36.4 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.3 లక్షల కోట్లు)తో జిడిపిలో 4.4 శాతంగా నమోదయ్యింది. ఇంతక్రితం జూన్ త్రైమాసికంలో ఇది 18.2 బిలియన్ డాలర్ల (రూ.1.5 లక్షల కోట్లు)తో జిడిపిలో 2.2%గా ఉంది. 2021-22 ఇదే క్యూ2లో 9.7 బిలియన్ డాలర్ల (రూ.80వేల కోట్లు)తో జిడిపిలో 1.3%గా నమోదయ్యింది." అని ఆర్‌బిఐ తెలిపింది. సెప్టెంబర్ త్రైమాసికంలో వాణిజ్య లోటు 83.5 బిలియన్ డాలర్ల (6.91 లక్షల కోట్లు)కు ఎగిసింది. జూన్ త్రైమాసికంలో ఇది 63 బిలియన్ డాలర్లుగా (రూ.5.21 లక్షల కోట్లు) ఉంది. దిగుమతులు పెరగడం.. ఎగుమతులు తగ్గడంతో వాణిజ్య లోటు ఏర్పడుతుంది. దేశ దిగుమతుల, అప్పులు, ఇతర విదేశీ చెల్లింపులు ఎక్కువగా ఉండి విదేశీ మారకం రాక తక్కువగా ఉంటే కరెంట్ ఎకౌంట్ లోటు చోటు చేసుకుం టుంది. ప్రపంచ దేశాల్లో భారత ఉత్పత్తులకు డిమాండ్ తగ్గడంతో ఎగుమతులు పడిపోతున్నాయి. మరోవైపు దేశీయంగా దిగుమతు లకు అధిక డిమాండ్ ఉండటంతో వాణిజ్య లోటు పెరుగుతోంది. మేక్ ఇన్ ఇండియా లాంటి కార్యక్రమాల్లో పెద్ద పురోగతి లేకపోవడంతో భారత్ అనేక ఉత్పత్తులను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. భారత అప్పులు భారీగా పెరగడంతో విదేశీ చెల్లింపులు భారం అవుతున్నాయి. ఈ పరిణామాలు భారీ కరెంట్ ఎకౌంట్ లోటుకు దారి తీస్తున్నాయి.

గూగుల్‌కు సిసిఐ డిమాండ్ నోటీసు

న్యూఢిల్లీ : ఆరోగ్యకర పోటీ వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నందుకు విధించిన జరిమానాను గడువులోపు చెల్లించనందుకు టెక్ దిగ్గజం గూగుల్‌కు కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) డిమాండ్ నోటీసులు అందజేసింది. గూగుల్‌కు వ్యతిరేకంగా సిసిఐ అక్టోబర్‌లో రెండు కేసుల్లోనూ మొత్తం రూ.2,274 కోట్ల జరిమానా చెల్లించాలని స్పష్టం చేసింది. ఈ మొత్తాన్ని 60 రోజుల్లోగా అంటే డిసెంబర్ 25 కల్లా చెల్లించాల్సి ఉండగా.. గడువు ముగిసింది. దీంతో తాజాగా గూగుల్‌కు డిమాండ్ నోటీసును జారీ చేసింది. సిసిఐ ఆదేశాలను ఎన్‌సిఎల్‌టిలో గూగుల్ సవాల్ చేసింది. దీనిపై విచారణ జరగాల్సి ఉంది. సిసిఐ ఆదేశాలపై అప్పీల్ చేశామని.. స్టే రాకపోతే చెల్లించాల్సి వస్తుందని గూగుల్ తెలిపింది.

మరో రెండు దేశాలతో స్వేచ్ఛా వాణిజ్యం : మంత్రి పియూష్

న్యూఢిల్లీ : వచ్చే ఏడాదిలో మరో రెండు దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) జరగనుందని వాణిజ్య శాఖ మంత్రి పియూస్ గోయల్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి బ్రిటన్, యూరోపియన్ యూనియన్, కెనడా దేశాలతో చర్చలు జరుగుతున్నాయన్నారు. 2023లో కనీసం రెండు దేశాలతో ఎఫ్‌టిఎ జరగనుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో భారత్-ఆస్ట్రేలియా మధ్య ఆర్థిక సహకర, వాణిజ్య ఒప్పందం జరిగిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.



బహుజన కళోత్సవ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తానా బహుజన కళోత్సవం జనవరి 1 న

ప్రజాశక్తి- కల్చరల్

తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా నిర్వహణలో జనవరి 1న రవీంద్రభారతి ప్రధాన వేదిక పై బహుజన కళోత్సవం నిర్వహిస్తున్నారు. తానా ప్రపంచ తెలుగు సాహిత్య వేదిక అధ్యక్షుడు ప్రసాద్ తోట కూర తార ఆర్ట్స్ అకాడెమీ అధ్యక్షుడు సంకె రాజేష్‌తో కలసి రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనవరి1న ఉదయం నుంచి రాత్రి వరకు నిర్విరామంగా బహుజనవర్గాలకు చెందిన సంప్రదాయ, జానపద కళారూపాల ప్రదర్శన ఉంటుందని రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 30 కళా బృందాలు 300 మంది కళాకారులు పాల్గొంటారని తెలిపారు.